

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి | బుధవారం | 01-04-2026 | సంపుటి: 01 | సంచిక : 285 | వెల: 2 రూ | పేజీలు :08 | సంపాదకులు: కట్ట హిమ పావని


Ranga Reddy Wednesday 01-04-2026 | Volume :01 | Issue: 285 | RS: 2 | Pages:08 | Editor : Katta HimaPavani



## రిపోర్టర్లు కావలెను




Contact Number
9059328777

## కేరళలో రాహుల్
# ఉద్ధృత ప్రచారం

- ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు
- అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు
- మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత

**తిరువనంతపురం,**
కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య

-మిగతా 2 లో



## బెంగాలీలను బీజేపీ
# అవమానం చేస్తోంది

- నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి
- సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం

**కోల్‌కతా,**
భారతీయ జనతా పార్టీ పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని 'అనాగరిక' పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా ఓటర్లను మమతాబెనర్జీ కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అవకతలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను

-మిగతా 2 లో

## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ
# సేకరణ


### ప్రజాస్వామ్య పద్ధతిలో మూసీ పునరుజ్జీవం పనులు

- 15 రోజులు ప్రజాభిప్రాయాలు స్వీకరిస్తాం
- వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం
- విలువైన సూచనలిచ్చిన వారితో 'సబ్ కమిటీ' సమావేశం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**హైదరాబాద్ మార్చి 31: (నేటి దర్శిని)**
మూసీ పునరుజ్జీవం పనులను ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని డిప్యూటీ సీఎం, మూసీ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మూసీ క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రి పొన్నం ప్రభా కర్‌తో కలిసి మూసీ పునరుజ్జీవం పనుల పురోగతిపై అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మూసీనది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయ పనులకు మార్చి 28న శంకుస్థాపన చేశామని తెలిపారు. అప్పటి నుంచి మూసీ ఫేస్-1, ఫేస్-2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన

-మిగతా 2 లో




## గుజరాత్ టైటాన్స్‌పై
# పంజాబ్ కింగ్స్ విక్టరీ

- 3 వికెట్ల తేడాతో విజయం సాధించిన పంజాబ్
- అజేయ హాఫ్ సెంచరీ చేసిన కూపర్ కన్నోలీ
- బౌలింగ్‌లో రాణించిన ప్రసిధ్ కృష్ణ

**న్యూ ఛండీగడ్: మార్చి 31: (నేటి దర్శిని)**
ఐపిఎల్ సీజన్-19లో పంజాబ్ కింగ్స్ బోణీ కొట్టింది. మహారాజ యదవింద్రసింగ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు మూడు వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 162 పరుగులు చేయగా.. అనంతరం పంజాబ్ కింగ్స్ 19.1ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 165పరుగులు చేసి విజయం సాధించింది. ఛేదనలో భాగంగా పంజాబ్ కింగ్ బ్యాటర్ కూపర్ కనోలీ(72నాటౌట్) చివరి వరకు క్రీజ్‌లో ఆ జట్టుకు విజయాన్నందించాడు. ప్రభ్ సిమ్రన్(37), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(17) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. గుజరాత్ బౌలర్లు ప్రసిధ్ కృష్ణకు మూడు,

-మిగతా 2 లో




# న్యూక్లియర్ రేస్!

- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అణ్వాయుధాల కోసం పోటాపోటీ
- అణు విధానంపై మారుతున్న ప్రపంచ దేశాల వైఖరి
- రక్షణ కవచంగా అణ్వాయుధాలను వాడుకోవాలని యోచన

**న్యూఢిల్లీ, మార్చి 31: (నేటి దర్శిని)**
ఏడాది కాలంలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ రెండుసార్లు దాడి చేశాయి. ఈ రెండు దాడులకు మూల కారణం ఇరాన్‌కు అణ్వాయుధాలను తయారుచేయగల సామర్థ్యం ఉండడమే. దీన్ని అమెరికా, ఇజ్రాయెల్ రెండూ ముప్పుగా పరిగణిస్తున్నాయి. ఇరాన్‌లో ఇప్పుడు ఐదవ వారంలోకి ప్రవేశించిన, ముగింపు కనిపించని సైనిక దాడి

-మిగతా 2 లో

## దేశంలో భారీ ఉగ్రకుట్ర..

4 లో

## కాళేశ్వరంపై
# కాంగ్రెస్ పగ

### కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధం



- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
- ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత కరువు
- దిశానిర్దేశం లేకుండా ముగిసిన అసెంబ్లీ సమావేశాలు
- రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి పంపాలి
- పొంగులేటి అవినీతిని బయటపెట్టినందుకే మా ఎమ్మెల్యేల సస్పెన్షన్

: మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ మార్చి 31: (నేటి దర్శిని)**
కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో రైతులకు శిక్ష వేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ మీద ద్వేషం ఉంటే తమకు శిక్ష వేయాలనీ, రైతుల పొట్ట కొట్టొద్దని కోరారు. తక్షణమే నిధులను విడుదల చేసి కాలువలకు నీళ్లు

-మిగతా 2 లో

# ఐదు రోజులు వానలు

- ఉదయం ఉక్కపోత సాయంత్రం ఈదురుగాలులు
- రాష్ట్రంలో ఆరెంజ్ అలర్ట్ జారీ

: వాతావరణ శాఖ

**హైదరాబాద్**
ద్రోణి, గాలి అనిశ్చితితో పాటు ఉపరితల చక్రవాకం ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు బుధవారం ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందనీ, రాత్రి వేళల్లో ఉక్కపోత వాతావరణం ఉంటుందని పేర్కొంది






## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

మొదటి తరువాయి

జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

## బెంగాలీలను బీజేపీ అవమానం చేస్తోంది

మొదటి తరువాయి

ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. 'బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది' అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీ-ఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను ఊడలాక్కుంటాయని ఆరోపించారు. ఓటర్ల లిస్ట్‌లో కొందరిని టా÷-గ్గ÷ట్ చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం-6 అప్లికేషన్లతో బీహార్ ఓటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం ఓటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారని అన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ ప్రక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సీ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సాంస్కృతిక ఆంక్షలు, వివాదాస్పద విధానాలు అవలంబిస్తోదని అన్నారు.

## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

మొదటి తరువాయి

రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో ఎబరఅతీసపఏస్త్రుఝఅశ్రీ.షశీఎ మెయిల్ ఐడీ ద్వారా ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను వ్యక్తం చేసిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని తెలిపారు. డిఫెన్స్ భూములు, మూసీ బాధితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్‌తో మాట్లాడటం ఇలా ఎక్కడికక్కడ పనులను విభజన చేసుకుని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి, యావత్ క్యాబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకుని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. అందరి జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతోందని సూచించారు. అధికారులకు ఎలాంటి సలహాలు, సూచనలతోపాటు ఏ ఇతర అవసరాలున్నప్పటికీ మూసీ సబ్ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. ఆ కమిటీ సభ్యులు 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినరు కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మనుచౌదరి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

మొదటి తరువాయి

దాడుల నేపథ్యంలో ఈ ప్రాంతంలో వరుస పేలుళ్లు చోటుచేసుకోగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీనిపై ఇరాన్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా.. ఇరాన్ సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇస్ఫహాన్‌లో ఓ భూగర్భ కేంద్రానికి తరలించినట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు.. తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే..ఇరాన్‌లో భారీ విధ్వంసాన్ని సృష్టిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇక్కడ భారీఎత్తున దాడులు జరగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చేశాం: ఐఆర్‌జీసీ**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తయారుచేసిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. ఐఆర్‌జీసీ అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఇస్ఫహాన్ ప్రాంతంలో ఎగురుతున్న ఈ డ్రోన్‌ను ధ్వంసం చేసినట్టు ఐఆర్‌జీసీ వర్గాలు పేర్కొన్నాయి.

**హార్ముజ్‌లో టోల్ వసూల్ : ఇరాన్ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదముద్ర**

ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్రమార్గాల్లో ఒకటైన హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై టోల్ వసూలుకు ఇరాన్ పార్లమెంట్ గ్రీన్ సిగల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి హార్ముజ్ నిర్వహణ ప్రణాళికకు పార్లమెంటరీ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఈ మార్గం గుండా ప్రయాణించే నౌకలు ఇకపై ఇరాన్ కరెన్సీ 'రియాల్' రూపంలో టోల్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రణాళికలో భాగంగా ఆర్థికపరమైన అంశాలే కాకుండా, జలసంధి భద్రత, పర్యావరణ పరిరక్షణ, నౌకల భద్రత బాధ్యతలను ఇరాన్ తన పరిధిలోకి తీసుకుంది. అమెరికా-ఇజ్రాయిల్ నౌకలు ఈ జలసంధి గుండా ప్రయాణించడాన్ని ఇరాన్ పార్లమెంట్ పూర్తిగా నిషేధించింది. అలాగే ఇరాన్‌పై ఏకపక్షంగా ఆంక్షలు విధించే దేశాల నౌకలకు కూడా అనుమతి నిరాకరించాలని నిర్ణయించింది. ఈ వ్యూహాత్మక జలసంధిపై తన సార్వభౌమత్వాన్ని చాటుకుంటూనే ఆదాయాన్ని పెంచుకోవాలని ఇరాన్ యోచిస్తోంది. ప్రపంచ ముడిచమురు సరఫరాలో ఐదో వంతు జరిగే ఈ మార్గం అంతర్జాతీయ జలాల పరిధిలోకి వస్తుందని అమెరికా సహా పలు దేశాలు చెబుతున్నాయి. అక్కడ టోల్ వసూలుకు ఇరాన్‌కు చట్టబద్ధత లేదని పేర్కొంటున్నాయి.

## గుజరాత్ టైటాన్స్‌పై పంజాబ్ కింగ్స్ విక్టరీ

మొదటి తరువాయి

రబాడా, అశోక్ శర్మ, రషీద్ ఖాన్, సుందర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు పంజాబ్ కింగ్స్ బౌలర్లు వ్యాషక్, చాహల్ దెబ్బకు గుజరాత్ టైటాన్స్ స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. 2025 సీజన్ రన్నరప్ పంజాబ్ బౌలర్లు ప్రారంభం నుంచే గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేశారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(39), జోస్ బట్లర్ (38) మాత్రమే రాణించడంతో గుజరాత్ ఆమాత్రమైనా స్కోర్ చేయగల్గింది. బట్లర్ ఔటయ్యాక గుజరాత్ బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్లు సాయి సుదర్శన్(13), శుభ్‌మన్ గిల్(39)లు రాణించినా.. సొంత మైదానంలో పంజాబ్ కింగ్స్ బౌలర్ల ధాటికి గుజరాత్ మిడిలార్డర్ తేలిపోయింది. సాయి సుదర్శన్‌ను ఔట్ చేసిన యాన్సెన్ తొలి బ్రేక్ ఇవ్వగా.. జోస్ బట్లర్(38)తో కలిసి గిల్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, చాహల్ ఓవర్లో గిల్ ఔటవ్వడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం గ్లెన్ ఫిలిప్స్(25) మెరుపు బ్యాటింగ్‌తో అలరించి స్కోర్‌బోర్డును ఉరికించాడు. అయితే.. విజరుకుమార్ ఓవర్లో అతడు అర్ష్‌దీప్ చేతికి చిక్కగా.. చాహల్ బౌలింగ్‌లో సిక్సర్‌కు యత్నించిన బట్లర్ బౌండరీ లైన్ వద్ద బార్ట్‌లెట్ క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత పంజాబ్ బౌలర్లు మరింత కట్టుదిట్టంగా



బంతులు విసిరి వాషింగ్టన్ సుందర్(18), షారుక్ ఖాన్(4), రాహుల్ తెవాటియా (11నాటౌట్)కు బ్యాటింగ్‌కు అడ్డుగా నిలిచారు.. దీంతో గుజరాత్ 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది.

స్కోర్‌బోర్డు...

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)శ్రేయస్ (బి)యాన్సెన్ 13, గిల్ (సి)కనోలే (బి)చాహల్ 39, బట్లర్ (సి)బార్ట్‌లెట్ (బి)చాహల్ 38, ఫిలిప్స్ (సి)యాన్సెన్ (బి)వ్యాషక్ 25, సుందర్ (సి)అర్ష్‌దీప్ (బి)వ్యాషక్ 18, షారుక్ ఖాన్ (సి)అర్ష్‌దీప్ (బి)వ్యాషక్ 4, తెవాటియా (నాటౌట్) 11, రషీద్ ఖాన్ (నాటౌట్) 0, అదనం 14. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 162పరుగులు.

వికెట్ల పతనం: 1/37, 2/83, 3/119, 4/129, 5/144, 6/150.

బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-42-0, బార్ట్‌లెట్ 4-0-36-0, యాన్సెన్ 4-0-20-1, వ్యాషక్ 4-0-34-3, చాహల్ 4-0-28-2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్యా (సి)అశోక్ శర్మ (బి)రబడా 7, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి)ప్రసిద్ కృష్ణ (బి)రషీద్ ఖాన్ 37, కనోలే (నాటౌట్) 72, శ్రేయస్ అయ్యర్ (సి)సుందర్ (బి)ప్రసిధ్ 18, వధేరా (సి)గిల్ (బి)సుందర్ 3, శశాంక్ సింగ్ (సి)బట్లర్ (బి)ప్రసిధ్ కృష్ణ 4, స్టొయినీస్ (సి)రషీద్ ఖాన్ (బి)ప్రసిధ్ కృష్ణ 0, యాన్సెన్ (సి)గిల్ (బి)అశోక్ శర్మ 9, బార్ట్‌లెట్(నాటౌట్) 11, అదనం 4. (19.1ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 165పరుగులు.

వికెట్ల పతనం: 1/7, 2/83, 3/110, 4/113, 5/118, 6/118, 7/144.

బౌలింగ్: సిరాజ్ 2-0-15-0, రబడా 3-0-34-1, అశోక్ శర్మ 3-0-31-1, రషీద్ ఖాన్ 4-0-29-1, సుందర్ 3.1-0-27-1, ప్రసిధ్ కృష్ణ 4-0-29-3.

## న్యూక్లియర్ రేస్!

మొదటి తరువాయి

ప్రపంచవ్యాప్తంగా అణు పోటీ అనే భూతాన్ని చెరవిముక్తి చేసినట్లుగా కనిపిస్తున్నది. పాలన మార్పు, అణు కార్యక్రమం ముగింపును తెచ్చే ఉద్దేశంతో ఇరాన్‌పై జరిగిన దాడులు యూరప్ నుంచి తూర్పు ఆసియా వరకు అన్ని దేశాలు ఇప్పుడు తమ అణు విధానంపై పునరాలోచించే పరిస్థితిని కల్పించాయి. శక్తివంతమైన మిత్రదేశాలపై ఆధారపడే బదులు సొంతంగా అణ్వాయుధాలు నిర్మించుకోవాలని చాలా దేశాలు యోచిస్తున్నాయి.

ఒకప్పుడు అమెరికా అణు ఛత్రం కింద తాము సురక్షితమని భావించిన దేశాలు ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ పాలనలో అమెరికా తీసుకునే నిర్ణయాలు అనూహ్యంగా ఉన్న నేపథ్యంలో సొంత ప్రత్యామ్నాయాలపైనే ఆధారపడేందుకు మొగ్గుచూపుతున్నాయి. అణ్వాయుధాల దాడికి గురైన ఏకైక దేశమైన శాంతికాముక జపాన్ సైతం ఇప్పుడు సొంతంగా అణ్వాయుధాల నిర్మాణం గురించి ఆలోచిస్తున్నది. చైనా, రష్యాతో పోటీపడాలని అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన ఆదేశాలతో 33 ఏండ్ల విరామం తర్వాత తాను కూడా అణు పరీక్ష



పునరుద్ధరించాలన్న ఆసక్తిని గత నవంబర్‌లో అమెరికా వ్యక్తం చేసింది.

**ఇరాన్ యుద్ధంతో ఆందోళనలు**

ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించుకుంటే తాము కూడా అణ్వాయుధ సామర్థ్యాన్ని సాధిస్తామని సౌదీ అధికారులు చాలాకాలంగా చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో పాక్, సౌదీ ఓ రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. తమ అణ్వాయుధాలు అవసరమైతే సౌదీకి కూడా అందుబాటులో ఉంటాయని పాక్ ఆ తర్వాత ప్రకటించింది. మరో పక్క నాటో సభ్య దేశమైన తుర్కియే తన సొంత అణు నిరోధక శక్తి కోసం అన్వేషిస్తున్నది. ఇరాన్ మరింత బలపడితే ఈ ప్రాంతంలోని అధికార సమతుల్యతను దెబ్బతీస్తుందన్న భయమే తుర్కియే ఆందోళనకు కారణం. లిబియా, ఉక్రెయిన్ విషయంలో చూసినట్లుగా అణ్వాయుధ కవచం లేని దేశాలు దాడుల నుంచి అధిక ప్రమాదాన్ని ఎలా ఎదుర్కొంటాయో ఇరాన్‌పై జరిగిన దాడి తెలియచేస్తుంది. అణ్వాయుధాలు కలగి ఉండటం ఇంటి గేటు దగ్గర ఒక డాబర్‌మాన్ శునకాన్ని కాపలాగా ఉంచుకోవడం లాంటిది. చొరబాటుదారులను భయపెట్టి తరిమివేయడానికి అది బాగా పనిచేస్తుంది. అణ్వాయుధాల నిల్వలను కలిగి ఉన్న ఉత్తర కొరియా సరిగ్గా ఇదే కారణంతో బాహ్య జోక్యాన్ని చాలా వరకు నిరోధించగలిగిందని నిపుణులు తెలిపారు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

మొదటి తరువాయి


వదలాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన వ్యాఖ్యలు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉన్నాయనీ, బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల ఫెవికాల్ బంధం బయటపడిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.90 వేల కోట్లు, రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి ఎలా మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులిచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకకరాల్లో ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని వివరించారు. భువనగిరి జిల్లాలో ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కాలువలకు వెళ్లి నీళ్లు వదులుతున్నారనీ,అవి కాళేశ్వరం నీళ్లు కావా?అని ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారనీ, అది కాళేశ్వరంలో భాగం కాదా? అని అడిగారు. హైదరాబాద్‌కు తాగునీటి కోసం మూసీ పక్కనుంచి 20 టీఎంసీల నీళు తేవడం కోసం రూ.ఎనిమిది వేల కోట్లతో కాలువలు తవ్వుతున్నారనీ, మల్లన్న సాగర్ నుంచి ఆ నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. భువనగిరి, చొప్పదండి, జగిత్యాల, సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ వెళ్లి సాగునీటిని, పంటలను చూద్దామనీ, నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో రైతులను అడుగుదామని కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, కిషన్‌రెడ్డి, బండి సంజరుతోపాటు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. రూ.50 కోట్లు విడుదల చేస్తే కొత్తగా రెండు లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులివ్వకుండా పగబట్టిందని విమర్శించారు.

# పేదల ఆసరాగా ప్రభుత్వ ఆసుపత్రి

**- ఆధునిక శస్త్రచికిత్సలు విజయవంతం**

**పెద్దపల్లి, మార్చి 31: (నేటి దర్శిని)**

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆధునిక వైద్య సదుపాయాలతో పేదలకు ఆసరాగా నిలుస్తోంది. ఇటీవల నాలుగు కీలక శస్త్రచికిత్సలను వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించింది. జమ్మికుంట మండలానికి చెందిన 50 ఏళ్ల మహిళ, చికురాయి గ్రామానికి చెందిన 42 ఏళ్ల మహిళలు గర్భాశయ సమస్యలతో ఆసుపత్రికి చేరగా, నిపుణులైన వైద్యులు ఆధునిక పద్ధతిలో హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలు చేసి గడ్డలను తొలగించారు. ఓదెల గ్రామానికి చెందిన 32 ఏళ్ల మహిళ, నిమ్మనపల్లి గ్రామానికి చెందిన 55 ఏళ్ల మహిళలు గాల్ బ్లాడర్ నెక్‌లో స్టోన్ సమస్యతో బాధపడుతుండగా, లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు.ఈ శస్త్రచికిత్సల్లో



లాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ అమర సింహా రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ, డాక్టర్ మీరాజ్, డాక్టర్ రవళిక, అనేస్తేషియా నిపుణులు డాక్టర్ స్వాతి, డాక్టర్ భవాని పాల్గొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలలో పాల్గొని వైద్య బృందాన్ని, ఓటి సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం, 2డి ఎకో, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ వంటి ఆధునిక సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆసుపత్రిలో అన్ని సేవలు ఉచితమని, ఎవరికీ లంచం ఇవ్వవద్దని, సమస్యలు ఎదురైతే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని, లేకపోతే కంప్లైంట్ బాక్స్‌లో ఫిర్యాదు ఇవ్వవచ్చని ఆయన స్పష్టం చేశారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆధునిక వైద్య సదుపాయాలతో పేదలకు నమ్మకమైన ఆశ్రయంగా నిలుస్తోంది

# అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు





● ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ రోడ్డు భద్రతపై కీలక సూచనలు

**మిడ్జిల్, మార్చి 31, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ హాజరై ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించి అవగాహన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ఆటోలకు ట్రాఫిక్ నంబర్లు వేయించుకోవడం వల్ల డ్రైవర్లకు మరియు పోలీసులకు గుర్తింపు సులభమవుతుందని, ప్రయాణికులు మరిచిపోయిన వస్తువులను సులభంగా గుర్తించి తిరిగి



అందించవచ్చని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం చూపుపై ప్రభావం చూపి ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అధిక వేగంతో వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలను PPT ద్వారా వివరించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ పాటించాలని సూచించారు. అలాగే పార్కింగ్ మరియు బస్ స్టాండ్ ల వద్ద వాహనాలను సింగిల్ లైన్‌లో పార్క్ చేయాలని సూచించారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన ఆటో డ్రైవర్లకు కళ్లజోళ్లు త్వరలోనే కంటి పరీక్షలు రాగానే పంపిణీ చేయడం జారుతుంది. ఆటో డ్రైవర్లు మంచి పేరు సంపాదించుకుని, ప్రజలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని ఎస్పీ గారు కోరారు.

**రోడ్డు భద్రత-మనందరి బాధ్యత**

ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సిబ్బందికి రెండు నెలల పాటు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు ముందుకు వచ్చిన "మునాఫ్ మిల్క్ పాయింట్" (విఎన్ఆర్ డెయిరీ) యజమాని మొహమ్మద్ మునాఫ్ గారిని జిల్లా ఎస్పీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్లు భాస్కర్ రెడ్డి, బాల్య నాయక్, 100 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. మరియు ఇతర ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతి, సామరస్యమే లక్ష్యం పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం

**మిడ్జిల్, మార్చి31(నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ శాంతి కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి హిందూ, ముస్లిం మరియు ఇతర మతాల పెద్దలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సమావేశంలో పాల్గొన్న వారందరూ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఇటీవల ఉగాది, రంజాన్ మరియు శ్రీరామనవమి పండుగలు జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించబడినట్లు తెలిపారు. ఇదే విధంగా రాబోయే హనుమాన్ జయంతి, బక్రీద్ వంటి పండుగలను కూడా పరస్పర గౌరవంతో, మతసామరస్యంతో జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. పండుగల సందర్భంగా ఊరేగింపులు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

**సోషల్ మీడియా పై ప్రత్యేక హెచ్చరిక:**
సోషల్ మీడియా వేదికలలో తప్పుడు ప్రచారం చేయడం, వదంతులు వ్యాప్తి చేయడం, ఒక మతాన్ని లేదా సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులు, వీడియోలు షేర్ చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు






చేయబడతాయని హెచ్చరించారు. ఎవరు అయినా చట్టాన్ని చేతిలోకి తీసుకుని అల్లర్లు, గొడవలు సృష్టించినా, సమాజ శాంతి భంగం చేసినా, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు హాని కలిగించే చర్యలకు పాల్పడినా వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ శాంతి కమిటీ సమావేశం ముఖ్య ఉద్దేశం జిల్లాలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి మరియు ఇతర పండుగలు ఎలాంటి మతపరమైన వివాదాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడిన అంశాన్ని సమీక్షించడం మరియు భవిష్యత్తులో కూడా ఇదే వాతావరణాన్ని కొనసాగించడమేనని ఎస్పీ తెలిపారు. ఇప్పటికే పండుగలు శాంతియుతంగా నిర్వహించబడినందుకు అన్ని మతాల పెద్దలకు అభినందనలు తెలియజేశారు. ఇకముందు కూడా ప్రతి పండుగను పరస్పర గౌరవంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్ని వర్గాల ప్రజలను కోరారు. సమావేశంలో పాల్గొన్న హిందూ, ముస్లిం మత పెద్దలు కూడా దీనికి పూర్తి సమ్మతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ఇన్స్పెక్టర్ అజాజుద్దీన్, మహబూబ్‌నగర్ రూరల్ ఇన్స్పెక్టర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ తదితరులు, హిందూ మరియు ముస్లిం మత పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలి

● సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**దేవరకొండ, మార్చి 31 నేటి దర్శిని ప్రతినిధి :**
రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీ సబ్ ప్లాన్ చట్టం తీసుకువస్తామని హామీ



ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో బీసీల సంక్షేమానికి 20 వేల కోట్ల రూపాయలు కేటాయించి, ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని ప్రకటించినప్పటికీ అమలు జరగలేదని విమర్శించారు. ప్రస్తుతం బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన కాకుండా కేవలం 3.8 శాతం మాత్రమే కేటాయింపులు చేస్తున్నారని, అందులో కూడా అరకంటే తక్కువ మొత్తమే ఖర్చు అవుతోందని గణాంకాలు సూచిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పున్న వెంకటేష్ నేత, పున్న బిక్షమయ్య, జక్కుల అంజి యాదవ్, బొమ్ము శ్రీనివాస్ యాదవ్, పొలమోని శేఖర్ గౌడ్, నట్వా సుధాకర్, చెరుకు అంజి గౌడ్, వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రారంభం




**మిడ్జిల్ మార్చి 31( నేటి దర్శిని ప్రతినిధి ):**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రోజు హెచ్‌పీవీ (హ్యూమ్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ వ్యాక్సిన్‌ను 14 సంవత్సరాల పైబడిన మరియు 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు అందించనున్నారు. బాలికల్లో గర్భాశయ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులను నివారించేందుకు ఈ కార్యక్రమం ముఖ్యమని వైద్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. మిర్జా, ఎంపీడీవో గీతాంజలి గారు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అయూబ్ ఖాన్ పాల్గొన్నారు. అలాగే ఫార్మసిస్టు శివకుమార్, హెల్త్ అసిస్టెంట్లు దేవయ్య, జంగయ్య, ఏఎన్ఎంలు పద్మజ, గీత, రాజేశ్వరి, నీలమ్మ, శ్రీదేవి, చంద్రకళ, తిరుపతమ్మ మరియు ఆశ కార్యకర్తలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఈ వ్యాక్సిన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమయానికి టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు.

# గేట్ తండాలో ఓ ఇంటి పైకప్పుకు ఇనుప పైపులు,రేకులు

● తన సొంత నిధులతో సమకూర్చిన రామ్మునంతల సర్పంచ్ వడిత్యావత్ శ్రీనునాయక్



**ఆమనగల్లు,మార్చి31(నేటి దర్శిని ప్రతినిధి);**
ఆమనగల్లు మండలంలో రామ్మునంతల గ్రామపంచాయతీ పరిధిలోని గేట్ తండాకు చెందిన జటావత్ రుక్మ ఉంటున్న ఇంటి పైకప్పు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లిన సందర్భంలో సర్పంచ్ శ్రీను నాయక్ తన సొంత నిధులతో ఈ సమస్యను పరిష్కరించారు. మంగళవారం ఇంటిపై కప్పుకు సరిపడా ఇనుప పైపులను, ఇనుప రేకులను, 25000 రూపాయల పైకప్పుకు సరిపడ సామాగ్రిని లబ్ధిదారునికి అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వరి మోహన్, వార్డు సభ్యులు ధనరాజ్,బలరాం, మరియు రూప్ సింగ్, శాంతిలాల్ , మోహన్,పవన్, గ్రామ ముఖ్య నాయకులు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శి ఉపాధ్యాయులు

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్






**దేవరకొండ, మార్చి 31 నేటి దర్శిని ప్రతినిధి :**
విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 38 సంవత్సరాలపాటు సేవలందించి పదవీ విరమణ పొందిన శ్రీమతి రెబెకా సదానందంని ఆయన గౌరవప్రదంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల నుండి వచ్చి విద్యను ఆయుధంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన రెబెకా సదానందం మూడు దశాబ్దాలకు పైగా నిబద్ధత, క్రమశిక్షణతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని కొనియాడారు. గ్రామీణ బాలికలకు విద్య ప్రాధాన్యతను తెలియజేసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని అభినందించారు. అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శమని, వారి సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ ఉపాధ్యాయుల పాత్రను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. అనంతరం శ్రీమతి రెబెకా సదానందంకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానం చేసి, విశ్రాంత జీవితం సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి మురళి, ఎంఈఓ మాతృ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఈ దోపిడీకి కళ్లెమెప్పుడు?




మరో రెండున్నర నెలల్లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఫీజులు ఎలా ఉంటాయన్న ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో మొదలైంది. ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజులు పెంచుతున్న సంకేతాలు యాజమాన్యాల నుంచి తల్లిదండ్రులకు అందాయి. పరిస్థితులు ఎలా ఉన్నా యాజమాన్యాలు ఏడాదికోసారి 20 నుంచి 30 శాతం ఫీజులు పెంచేస్తున్నాయి. నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫీజుల భారం లేకుండా చేస్తామని గత సర్కార్ కమిటీల పేరిట సాగదీసింది. ప్రస్తుత ప్రభుత్వం గద్దెనెక్కి రెండేం డ్లు దాటినా ఫీజుల దోపిడీని అరికట్టలేకపోయింది. ఇది వచ్చే విద్యాసంవత్సరానికైనా అమల్లోకి వస్తుందా అన్నది సంశయంగానే ఉంది. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. రాష్ట్రంలో విద్యా సంవత్సరం అంటే ఫీజుల దోపిడీ అన్నట్టుగా మారింది. ఇంజినీరింగ్ విద్యకు అత్యధిక వార్షిక ట్యూషన్ ఫీజు రూ.1.83 లక్షలు. అదే పాఠశాల విషయానికి వస్తే కార్పొరేట్ స్కూళ్లలో రూ.5 లక్షలు! పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన ఓ పాఠ శాల కొద్దిరోజుల క్రితం పాఠ్యపుస్తకాల ధరలను రూ.18 వేలకు పెంచింది. అలాగే పేరొందిన ప్రముఖ విద్యా సంస్థలు ఆరో తరగతి ఫీజును అమాంతం 30 వేల రూపాయలు అదనంగా పెంచాయి! దీన్ని సాకుగా చూపెడుతూ కొన్ని యాజమాన్యాలు 'మా దగ్గర ఫీజు తక్కువగా ఉంది. బయట చూడండి మీకే తెలుస్తుంది' అంటూ ఏదో తక్కువ చేస్తున్నట్టు నటిస్తూ అందినకాడికి దండుకుంటు న్నాయి. ఇలాగైతే సామాన్యుల పిల్లలకు విద్య అందేనా? ఈ దోపిడీకి కళ్లెమెప్పుడు? ఈ ప్రశ్నే తల్లిదండ్రుల గుండెలో ఇప్పుడు ఒక ఆందోళనగా ఉంటోంది. ఇంత బహిరంగంగా ఫీజుల్ని పెంచుతుంటే, ప్రభుత్వ పెద్దల కట్టడి చేసే చర్యలు మాటలకే పరిమితం కావడం శోచనీయం. ప్రభుత్వం ఏడాది క్రితమే ఫీజుల నియంత్రణకు చట్టం తెచ్చేందుకు బిల్లు నమూనా సిద్ధమైనప్పటికీ, దానిపై ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనేక అంశాలపై బిల్లులు ఆమోదం పొందినా ఫీజుల బిల్లును మాత్రం ఆమోదానికి పెట్ట లేదు. దీని వెనుక అంతర్య మేంటి? వ్యక్తిగత అంశాలపై సవాల్ విసురు కునేందుకు సమయం కేటాయించిన అధికార, ప్రధాన ప్రతిపక్షసభ్యులు లక్షల మందికి ఉపయోగపడే బిల్లు గురించి ఎందుకు మాటాడలేదు? కావాలనే పక్కన పడేశారా అన చర్చ ఇప్పుడు నడుస్తోంది. దీనికి జవాబు పాలకులే చెప్పాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, ఆచరణలో అడుగు కూడా ముందుకు పడలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత సర్కార్ రుసుములను కట్టడి వేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని 2024 సెప్టెంబర్‌లో ప్రకటించింది. రాష్ట్ర విద్యాకమిషన్ కూడా దీనికోసం చట్టం తీసుకురావాలని స్పష్టంగా సిఫార్సు చేసింది. అయినప్పటికీ అమల్లోకి రాకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒకవైపు విద్య వంటి ప్రాథమిక హక్కు విషయంలో ఇలా ఆలస్యం చేయడం అనేక అనార్థాలకు దారితీస్తుందని మేధావులు, విద్యావేత్తల అభిప్రాయం. ఇంకోవైపు, "అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య" అనే నినాదం ప్రజలను ఆకర్షించేలా ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు దానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థాయిలో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామనే ప్రకటనలు వినిపిస్తున్నాయి. "యంగ్ ఇండియా" వంటి పేర్లతో కొత్త ప్రభుత్వ పాఠశాలల ప్రచారం జరగడం ఒకవైపు ఆశాజనకంగా కనిపించినా, టెక్నో, గ్లోబల్, ఒలింపియాడ్ వంటి పేర్లతో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో దోచుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ ఫీజులు పెంచుకునేందుకు పాలకవర్గాలే అవకాశం కల్పిస్తున్నాయి. కొన్ని పాఠశాలలు అదనపు ఫీజులు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో మరింత భారాన్ని మోపుతు న్నాయి. దీనివల్ల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చే ధోరణి పెరుగుతున్నప్పుడు, ప్రభుత్వ నియంత్రణ ఉండాలి.కానీ, లేకపోవడం బాధాకరం. విద్య అనేది లాభాపేక్షతో నడిచే రంగం కాకూడదు. అది సమాజ అభివృద్ధికి పునాది. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. దీన్ని నిర్వర్తించడంలో ఆలస్యం చేయడమంటే భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టినట్టే. ఇలాంటి పరిస్థితుల్లో మాటలు కాకుండా చర్యలు అవసరం. ఇప్పటికైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురా వాలి. ఆ చట్టంలో ప్రతి పాఠశాల ఫీజుల నిర్మాణం పారదర్శ కంగా ఉండేలా నిబంధనలు పెట్టాలి. నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసి, ఫీజుల పెంపుపై పర్యవేక్షణ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచి, ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయమివ్వాలి.

# దేశంలో భారీ ఉగ్రకుట్ర..


- ఢిల్లీలో లష్కరే తొయిబా ఉగ్రవాది అరెస్ట్..
- సంచలన నిజాలు వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి 31: (నేటి దర్శిని)** దేశంలో భారీ ఉగ్రకుట్ర బయటపడింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు సహకరిస్తున్న షబ్బీర్ అహ్మద్ అనే ఉగ్రవాదిని ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఉగ్రదాడులకు సంబంధించి కీలక సమాచారాన్ని సేకరించారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని వాణిజ్య ప్రాంతాలు, హిందూ దేవాలయాలే టార్గెట్‌గా ఎంచుకున్నట్లు వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బంగ్లాదేశ్ కేంద్రంగా పని చేసే ఉగ్రసంస్థలతో, అలాగే పాక్ ఉగ్రవాద సంస్థలతోనూ ఢిల్లీకి చెందిన షబ్బీర్ అహ్మద్ సంబంధాలు కలిగి ఉన్నాడు. దేశంలోని కీలక ప్రదేశాలకు సంబంధించిన సమాచారాన్ని అతడు లష్కరే తొయిబా వంటి సంస్థలకు చేరవేశాడు. ఢిల్లీలోని ప్రధాన కేంద్రాల్ని వారు లక్ష్యంగా ఎంచుకుని, అనేక ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని హిందూ ఆధ్యాత్మిక కేంద్రాలైన కల్కాజి టెంపుల్, చాతర్‌పూర్ టెంపుల్, లోటస్ టెంపుల్‌లతోపాటు ప్రధాన వాణిజ్య కేంద్రాలైన కొన్నాట్ ప్లేస్, పహర్‌గంజ్ వంటి కమర్షియల్ హబ్స్‌ను ఎంచుకున్నారు. షబ్బీర్ అహ్మద్ వాటిని మొత్తం పరిశీలించి, అక్కడి వివరాల్ని వీడియోలుగా చిత్రీకరించి, వాటిని పాక్ ఉగ్రసంస్థలకు చేరవేశాడు. షబ్బీర్ ఒంటరిగా తిరుగుతూ ఆ ప్రదేశాల వివరాల్ని సేకరించాడు. అతడు బంగ్లాదేశ్, పాక్ ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐ వంటి పాక్ ఇంటెలిజెన్స్ సంస్థలతో కూడా కలిసి పని చేస్తున్నాడు. బంగ్లాదేశ్‌లో ఒక కొత్త తీవ్రవాద సంస్థను స్థాపించాలనే లక్ష్యంలో భాగంగా షాబిద్, మిగతా ఉగ్రవాదులు కలిసి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో సభ్యుల్ని చేర్చుకోవడం, ఉగ్రవాదంపై ప్రోత్సహించడం వంటి కార్యకలాపాలు లక్ష్యంగా వీరు పని చేస్తున్నారు. భారత నిఘా సంస్థల నుంచి తప్పించుకునేందుకు షబ్బీర్.. టెలిగ్రాం వంటి యాప్స్ వాడేవాడు. ఇటీవల ఇలాగే జమ్మూ కాశ్మీర్‌లో ఇలాగే టీఆర్ఎఫ్ (ద రెసిస్టెన్స్ ఫ్రంట్) అనే ఉగ్ర సంస్థ పుట్టుకొచ్చిన సంగతి తెలిసిందే. ఢిల్లీ పోలీసులు సరైన సమయంలో షబ్బీర్ అనే ఉగ్రవాదిని గుర్తించడంతో భారీ కుట్ర భగ్నమైంది.

# 5 రోజుల్లో బ్రెయిన్ ట్యూమర్ మటుమాయం!


- సరికొత్త ఔషధాన్ని తయారు చేసిన పరిశోధకులు



**న్యూఢిల్లీ, మార్చి 31: (నేటి దర్శిని)** క్యాన్సర్ రకాల్లో 'గ్లియోబ్లాస్టోమా' అనేది ప్రాణాంతకమైనది. ఈ వ్యాధి బారినపడిన రోగుల్లో బ్రెయిన్ ట్యూమర్‌ను ఐదు రోజుల్లో మటుమాయం చేసే అద్భుతమైన ఔషధాన్ని పరిశోధకులు అభివృద్ధి చేశారు. అమెరికాలోని మసాచుసెట్స్‌కు చెందిన 'మాస్ జనరల్ క్యాన్సర్ సెంటర్' పరిశోధకులు 'కార్‌వీ3-టీమ్-ఈ' అనే టీ- సెల్ థెరపీ నుంచి తయారుచేసిన ఔషధం ఊహించని ఫలితాన్ని చూపింది. 2024లో నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో మొదటి ముగ్గురు పేషంట్లలోని ట్యూమర్ల పరిమాణం గణనీయంగా తగ్గినట్టు గుర్తించారు.వీరి పరిశోధనపై 'ద న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' కథనం ప్రకారం, ఔషధం ఒక్క డోస్‌తో.. కొన్ని రోజుల్లో కణితి గణనీయంగా కుంచించుకుపోయింది. ఒక సందర్భంలో కణితి దాదాపు మాయమైంది. ముగ్గురు రోగుల్లో ఒకరికి 5 రోజుల్లోనే ట్యూమర్ తగ్గిపోవటం.. క్యాన్సర్ చికిత్సలోనే ఒక సంచలనం. 'కార్-టీ' సెల్ థెరపీ ద్వారా శరీరంలోని రోగ నిరోధక కణాలను (టీ-కణాలు) జన్యుపరంగా మార్చి, క్యాన్సర్ కణాలను గుర్తించి చంపేలా చేస్తారు. దీంట్లో పేషెంట్ టీ-కణాలను సేకరించి, ప్రయోగశాలలో మార్పులు చేసి, తిరిగి రోగి శరీరంలోకి ప్రవేశపెడతారు.

# అమెరికా మీకు సాయం చేయదు

- ఇరాన్‌పై యుద్ధంలో కలిసిరాని బ్రిటన్ సహా మిత్ర దేశాలకు డొనాల్డ్ ట్రంప్ కౌంటర్



**న్యూఢిల్లీ, మార్చి 31: (నేటి దర్శిని)** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇంధన కొరతనుఎదుర్కొంటున్న దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు ప్రత్యామ్నాయాలు సూచించారు. అమెరికా నుంచి చమురు కొనండి లేదా ఇరాన్ అడ్డగించిన హొర్ముజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాలు సాధించుకోండి అంటూ మంగళవారం యుద్ధ ప్రభావిత దేశాలకు ట్రంప్ పిలుపునిచ్చారు. యుద్ధంలో చేరాలంటూ తాను ఇచ్చిన పిలుపును తిరస్కరించిన మిత్రదేశాలపై ట్రంప్ మండిపడ్డారు. దేశాలు తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలి. మిమ్మల్ని కాపాడేందుకు అమెరికా అక్కడ ఎప్పుడూ ఉండదు. ఇరాన్ దాదాపుగా నాశనమైంది. ఒక కష్టమైన పని పూర్తయింది. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌ను నిర్వీర్యం చేయడంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన బ్రిటన్‌సహా హొర్ముజ్ జలసంధి కారణంగా జెట్ ఇంధనం పొందలేని దేశాలన్నిటికీ నాదో సలహా. మొదటిది అమెరికా నుండి కొనండి. మా వద్ద పుష్కలంగా ఉంది. రెండవది కొంత ఆలస్యమైనా ధైర్యం కూడగట్టుకుని ఆ జలసంధికి వెళ్లి దానిని స్వాధీనం చేసుకోండి అని ట్రూత్ సోషల్ పోస్టులో పేర్కొన్నారు.

**హొర్ముజ్ తెరువకపోయినా..**


ఇరాన్‌తో యుద్ధం ఐదో వారానికి చేరుకోవడం.. ఈ సంక్షోభం అంతమయ్యే సూచనలు కన్పించకపోవడంతో ఎలాగైనా యుద్ధాన్ని ముగించేద్దాం అని ట్రంప్ యోచిస్తున్నారు. తాము ప్రారంభించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి తెరదించాలని తాను భావిస్తున్నానని ఆయన తన సన్నిహితుల వద్ద పేర్కొన్నారని, ప్రస్తుతం ప్రధాన సమస్యగా ఉన్న హొర్ముజ్ జలసంధి మూసివేత కొనసాగుతున్నా.. ఆ సమస్యను పక్కన పెట్టి యుద్ధాన్ని ముగించాలని భావిస్తున్నారని ఉన్నతాధికారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది.

**యుద్ధం ఖర్చులు గల్ఫ్ దేశాలు భరించాలి!**

ఇరాన్‌పై యుద్ధం కోసం కోట్లాది డాలర్లు ఖర్చు చేస్తున్న అమెరికా.. ఈ భారాన్ని గల్ఫ్ మిత్రదేశాలపై మోపేందుకు సిద్ధమవుతున్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థపై పడుతున్న కోట్లాది డాలర్ల భారాన్ని తగ్గించుకొనేందుకు ట్రంప్ సరికొత్త ప్రతిపాదన చేసినట్టు తెలుస్తున్నది. అమెరికా చేస్తున్న వ్యయానికి సౌదీ అరేబియా, యూఏఈ వంటి సంపన్న అరబ్ మిత్ర దేశాల నుంచి రాబట్టాలని ట్రంప్ భావిస్తున్నారని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి.

# అమెరికా టెక్ కంపెనీలే మా లక్ష్యం..

- గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ యూనిట్లపై దాడి చేస్తాం..!
- ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక హెచ్చరిక




**న్యూఢిల్లీ, మార్చి 31: (నేటి దర్శిని)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక హెచ్చరికలు చేసింది. హర్మ్యూజ్ జలసంధి (నశీతీఎబఓ క్షీతుఊ)ని తెరవకుంటే ఖర్గ్ ద్వీపం, విద్యుత్ కేంద్రాలను పేల్చి వేస్తామని ట్రంప్ హెచ్చరించగా.. తామేమీ తక్కువ కాదంటూ యాపిల్, మైక్రోసాఫ్ట్ సహా ఆ దేశానికి చెందిన 18 కంపెనీలపై దాడులు చేస్తామని ఐఆర్‌జీసీ బదులు హెచ్చరిక చేసింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమెరికాలోని టెక్ కంపెనీలే తమ ప్రధాన లక్ష్యమని ఐఆర్‌జీసీ ఒక ప్రకటనలో వెల్లడించింది.పశ్చిమాసియా యుద్ధంలో ఊహించని విధంగా ప్రతి దాడులతో అమెరికాకు ముచ్చెమటలు పట్టిస్తున్న ఇరాన్ ఈసారి ఆ దేశంలోని టెక్ కంపెనీలను లక్ష్యంగా చేసుకోనుంది. ఖర్గ్ ద్వీపం, విద్యుత్ కేంద్రాలను పేల్చి వేస్తామని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో అమెరికాకు వణుకు పుట్టించేలా ప్రముఖ టెక్ సంస్థలపై, పారిశ్రామిక కేంద్రాలపై దాడులు చేయాలనుకుంటోంది.ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతీకార దాడులను తీవ్రతరం చేస్తామని, 18 సాంకేతిక కంపెనీలను టార్గెట్ చేస్తామని మంగళవారం ఐఆర్‌జీసీ వెల్లడించింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, ఇంటెల్, ఐబీఎం, టెస్లా, బోయింగ్.. వంటి కంపెనీలపై దాడులు చేసి.. వాటి వ్యవస్థను దెబ్బతీస్తామని హెచ్చరించింది. 'ఇరాన్‌పై అమెరికా దాడులకు ప్రతిచర్యగా ఈ 18 కంపెనీల యూనిట్లపై దాడులు చేస్తాం. ఏప్రిల్ 1 వ తేదీ బుధవారం టెహ్రాన్ కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల నుంచి దాడులు కొనసాగుతాయి. ఉగ్ర స్థావరాలను గుర్తించే అమెరికా ఐసీటీ, ఏఐ కంపెనీలు ఇకపై మా న్యాయబద్ధమైన లక్ష్యాలు' అని ఐఆర్‌జీసీ ప్రకటించింది.

# ఆసుపత్రి నుంచి సోనియా డిశ్చార్జ్



**న్యూఢిల్లీ, మార్చి 31: (నేటి దర్శిని)** కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. వాతావరణ మార్పుల వల్ల ఆమె పొట్ట, మూత్రనాళ ఇన్ఫెక్షన్‌కు గురవ్వడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేర్పించారు. తన ఆరోగ్యం మెరుపడిన తర్వాత మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆమె తదుపరి చికిత్స ఇంటివద్దే కొనసాగుతుందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మార్చి 24న చికిత్స కోసం సోనియాగాంధీ ఆసుపత్రిలో చేరారు. ఆమెకు డాక్టర్ డి.ఎస్.రాణా, డాక్టర్ ఎస్. నంది, డాక్టర్ అరూప్ బసుల బృందం పర్యవేక్షణలో చికిత్సనందించడం జరిగింది. ఇన్ఫెక్షన్ తగ్గించడానికి ఆమెకు యాంటీబయోటిక్స్ అందించాము. చికిత్సకు స్పందించి ఆమె కోలుకున్నారు. మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆమె తదుపరి చికిత్స ఇంటివద్దే కొనసాగుతుంది అని ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అజరు స్వరూప్ వెల్లడించారు.

## మహాలక్ష్మి పథకంతో వరంగల్ జిల్లా మహిళలకు రూ. 10 వేల కోట్ల ప్రయోజనం....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 31 (నేటి దర్శిని బ్యూరో):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మంగళవారం టిఎస్ఆర్టిసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా ఈ మొత్తాన్ని ఆదా చేసిందని పేర్కొన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా వరంగల్ జిల్లాలోని మహిళలకు సుమారు రూపాయలు 10 వేల కోట్ల ఆర్థిక లాభం చేకూరిందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం రేవంత్ రెడ్డి మహిళల కోసం ఈ పథకాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఉచిత బస్సు సౌకర్యంతో చిరు వ్యాపారస్తులు నెలకు రూపాయలు 1000 నుంచి 2000 వరకు ఆదా చేసుకుంటూ కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు సేవలను వినియోగిస్తున్న మహిళలు, విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

## మద్యం మత్తులో భార్యను,కొడుకును చంపిన కసాయి తండ్రి...

● కూతురు పరిస్థితి విషమం...



**ఆమనగల్లు,మార్చి31 (నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మండలంలో సీతారాంనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పులిగోనిపల్లి తండాలో భార్యని, కుమారుడిని,భర్త కత్తితో పొడిచి చంపాడు. కూతురు కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుంది. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సీతారాంనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పులుగొనిపల్లి తండాలో బాణావత్ రాందాస్ నాయక్, కవిత దంపతులు నివసిస్తున్నారు. వీరికి కూతురు పవిత్ర, కుమారుడు హర్ష, వీరి సంతానం కాగా ఆమనగల్లు పట్టణ సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్ మిల్ లో రాందాస్ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కవిత రోజువారి కూలీ పనికి వెళ్లి కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. ఈ దంపతుల మధ్య కొన్ని రోజుల నుండి గొడవలు జరుగుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున భార్యని, కుమారుడిని, కూతురిని, కత్తితో పొడిచాడు. భార్య, కుమారుడు, ఘటన స్థలంలోనే మృతి చెందాగా కూతురు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు కు సంబంధించి అతనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

● శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచన



**చింతపల్లి, మార్చి 31 నేటి దర్శిని ప్రతినిధి :** నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలోని పరిస్థితులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమగ్రంగా ఆరా తీశారు. నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను పరిశీలించి, దర్యాప్తు ప్రక్రియలో ఎటువంటి అలసత్వం వహించరాదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో దేవరకొండ డిఎస్పీ శ్రీనివాసరావు, నాంపల్లి సీఐ రాజు చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇషా రెడ్డి పుట్టినరోజు వేడుకలో నిరుపేద పిల్లలకు అల్పాహారం పంపిణీ







**ఎల్.బి.నగర్, మార్చి31 (నేటి దర్శిని):** ఇషా రెడ్డి మొదటి పుట్టినరోజు సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద పిల్లలకు అల్పాహార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేద పిల్లలకు ఆహారం అందిస్తూ సేవా భావాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, "ఏ రూపంలోనైనా, మీ ఇంట్లో ఏ శుభకార్యమైనా జరుపుకుంటే, ఆ ఆనందాన్ని ఈ నిరుపేద పిల్లలతో పంచుకోవడం మా సంస్థ లక్ష్యం. పేదలకు ఆహారం అందించడమే మా ప్రధాన సంకల్పం" అని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి కోశాధికారి కుష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా, సభ్యులు సిద్ధార్థ్ పాల్చం, సునీల్ దరాడే, పాక సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వారు ఇషా రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సేవా కార్యక్రమాన్ని అభినందించారు. పుట్టినరోజును సేవా కార్యక్రమంగా నిర్వహించడం ద్వారా సమాజానికి మంచి సందేశం అందించిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసించారు.

## కోర్ర తండాలో మిషన్ భగీరథ నీరు రాక అవస్థలు

● అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
త్వరిత పరిష్కారం లేకుంటే నిరసన హెచ్చరిక





**దేవరకొండ, మార్చి 31నేటి దర్శిని ప్రతినిధి :** దేవరకొండ పట్టణ పరిధిలోని కోర్ర తండా గ్రామపంచాయతీ ప్రజలు మిషన్ భగీరథ తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం పైపులు పగిలిపోయాయని అధికారులు చెప్పినప్పటికీ ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామ సర్పంచ్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొర్ర చందు నాయక్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా వారం గడిచినా నీటి సరఫరా పునరుద్ధరణ కాలేదు.ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు తీసుకుని మిషన్ భగీరథ నీటిని అందించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే వందలాది మంది బిందెలతో రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహించాల్సి వస్తుందని చందు నాయక్ హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్





**దేవరకొండ మార్చి 31 నేటి దర్శిని ప్రతినిధి :** దేవరకొండ నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అండగా నిలిచారు. నేడు ఆయన వివిధ ప్రాంతాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదాల సమాచారం అందుకున్న వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే, పోస్టుమార్టం కోసం ఉంచిన మృతదేహాలకు నివాళులు అర్పించి, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలుసుకుని ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం తమకు తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారు ఒంటరిగా లేరని ధైర్యం చెప్పి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యులు, పోలీసు అధికారులతో మాట్లాడిన ఆయన ప్రమాదాలకు గల కారణాలను సమగ్రంగా విచారించాలని, బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## కొత్తూరు బడ్జెట్ రూ.36.51 కోట్లు

● బడ్జెట్ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు స్వాగతం
శాలువాతో సన్మానించిన మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్




**కొత్తూర్ మార్చ్ 31 ( నేటి దర్శిని ప్రతినిధి )** కొత్తూరు మున్సిపాలిటీ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.36.51 కోట్ల అంచనా బడ్జెట్ కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. సోమవారం కొత్తూరు మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగ్యస్వామ్యంతోపాటు మున్సిపాలిటీ ఆదాయం పెంచడం ద్వారానే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అన్ని రకాల పనులు,అదనపు డిపాజిట్లు, ప్లాన్ గ్రాంట్,నాన్ ప్లాన్ గ్రాంట్, ఇతర అభివృద్ధి పనుల నిధులతో కలిపి మొత్తం రూ .36.51 కోట్లుతో బడ్జెట్ రూపొందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్,కౌన్సిలర్లు మాధవి గోపాల్ గౌడ్, చంద్రకళ రాజేందర్ గౌడ్,కోస్గి శ్రీనివాస్, సోమ్లా నాయక్,వీరమోని హేమ దేవేందర్ ముదిరాజ్,కమ్మరి జయమ్మ జనార్ధన్ చారి, మాదారం నరసింహ గౌడ్, బ్యాగరి ప్రసన్న లత యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం విజయవంతం





- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో వెయ్యి కోట్ల రూపాయల ఆదా
- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**దేవరకొండ మార్చి 31 నేటి దర్శిని ప్రతినిధి:** ప్రజాపాలన ప్రగతి పథం నినాదంతో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి వెయ్యి కోట్ల రూపాయల ప్రయాణ ఖర్చు ఆదా చేసిన సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ ఆధ్వర్యంలో దేవరకొండ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల్లోనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి




మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు ఆర్థిక భారం లేకుండా స్వేచ్ఛగా ప్రయాణిస్తూ తమ దైనందిన అవసరాలను సులభంగా నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారత దిశగా ఇది కీలక అడుగని, ఈ పథకం ద్వారా మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా జీవన ప్రమాణాలు కూడా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారిందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని పథకాలను అమలు చేస్తుందని, ప్రతి మహిళ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ప్రయోజనం పొందిన మహిళలను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, ఆర్.ఎం నల్లగొండ భీంరెడ్డి, డీఎం విజయ కుమారి, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి, ఆర్టీసీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి కృషి చేసిన నవజీవన్ రెడ్డికి బీడీఎల్ వాసుల సత్కారం



**హయత్ నగర్, మార్చి 31 (నేటి దర్శిని):** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీవాసులు నేడు తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారిని ఘనంగా సన్మానించారు. కాలనీ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, రోడ్లు, డ్రైనేజ్, మంచినీటి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో నవజీవన్ రెడ్డి గారు విశేష కృషి చేశారని ప్రశంసించారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి వెంటనే స్పందించి పరిష్కరించే నాయకత్వ లక్షణం ఆయనకు ఉన్నదని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, తనపై చూపిన ప్రేమాభిమానాలకు కాలనీవాసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, సహకారం వల్లనే తాను సేవ చేయగలుగుతున్నానని పేర్కొన్నారు. ఇక ముందు కూడా కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ కాలనీ అధ్యక్షులు క్రిష్ణ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆచి బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి శోభాయాత్ర హరీష్ రావుకు ఆహ్వానం అందజేసిన సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్, మార్చి 31 (నేటి దర్శిని):** హనుమాన్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 2న నిర్వహించనున్న భవ్య శోభాయాత్రకు తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు గారిని ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తూ ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రత్యేక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గురువారం సాయంత్రం 4:00 గంటలకు బి.ఎన్.రెడ్డి నగర్ చౌరస్తా నుండి సాహెబ్ నగర్‌లోని శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం వరకు భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తి, శక్తి, ఐక్యతకు ప్రతీకగా నిర్వహించే ఈ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు, మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి: నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్






- జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం లో కలెక్టర్ వెల్లడి

**నల్గొండ, మార్చి 31 (నేటి దర్శిని ప్రతినిధి):** ఇటీవల నూతనం పునర్వవతీకరించిన జిల్లా స్థాయి నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ మొదటి సమీక్షా సమావేశం మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు తీరు, బాధితులకు అందుతున్న పరిహారం మరియు ఇతర సామాజిక అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. సమావేశం ప్రారంభంలో కలెక్టర్ గారు ప్రత్యేకంగా కమిటీ సభ్యుల అభిప్రాయాలను మరియు వారి క్షేత్రస్థాయి అనుభవాలను అడిగి తెలుసుకోగా, సభ్యులు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ బాధితులు న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి కనీస గౌరవం ఇచ్చి, వారి



సమస్యను ఓపికగా విని, ఫిర్యాదు ఇచ్చిన వెంటనే వారిలో ధైర్యం నింపేలా పోలీసుల స్పందన ఉండాలని సభ్యులు కోరారు. బాధితులకు చట్టంపై నమ్మకం కలిగించేలా న్యాయ భరోసా కల్పించాలని, ఎఫ్.ఐ.ఆర్ నమోదు, వైద్య పరీక్షలు, రక్షణ కల్పించడం వంటి తక్షణ చర్యల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని సభ్యులు బలంగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల వివరాలను, ప్రస్తుతం కోర్టుల్లో మరియు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఫైళ్లను కలెక్టర్ గారు పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కేసు పురోగతిని సమీక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో ఛార్జ్ షీట్లు దాఖలు చేయాలని మరియు బాధితులకు అందాల్సిన ఆర్థిక ఉపశమన నిధులు (=వశ్రీఅవట ఖీబఅఎం) ఏ దశలోనూ సాంకేతిక కారణాలతో ఆగిపోకుండా నేరుగా వారి ఖాతాల్లోకే త్వరితగతిన చేరేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, డిప్యూటీ డైరెక్టర్, శశికళ, ఇంచార్జ జేసి అశోక్ రెడ్డి, కమిటీ సభ్యులు సంకు ధనలక్ష్మి, యేకుల అనిత కుమారి, బెజ్జం సైదులు, ధనావత్ భాస్కర్,భీమనపల్లి సైదులు,కర్నాటి కరుణాకర్ రెడ్డి,పాదం అనిల్ , బురుగు శ్రీనివాస్ గౌడ్ అదేవిధంగా నల్గొండ జిల్లా ఏఎస్పీ లు, డీఎస్పీ లు, ఆర్డీఓ లు మరియు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమావేశం అంతరం ఈ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్, ఎస్పీ లకు అంబేద్కర్ ఫోటో ఫ్రేమ్ లను బహుకరించారు.

## సి.యం సహాయ నిధి చెక్కు పంపిణీ



**మహేశ్వరం, మార్చి 31 (నేటి దర్శిని):** మహేశ్వరం నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం దిశగా మరో ముందడుగు పడింది. జిల్లెలగూడ పరిధిలో మంజూరైన రూ. 40,000 సి.యం సహాయ నిధి చెక్కును లబ్ధిదారు శ్రీమతి శారద గారికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అవసరమైన ప్రతి కుటుంబానికి సహాయ నిధులు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ శ్రీ అర్కల భూపాల్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీ అర్కల కామేష్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీమతి సునీత బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచినా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు యలమందల జగదీష్





- నిత్యవసర సరుకులు పంపిణీ

**ఖమ్మం,మార్చి 31(నేటి దర్శిని):** ఖమ్మం అర్బన్ మండలం,కైకొండాయిగూడెం,1వ డివిజన్ లో నివాసముంటున్న బోడ నాగేశ్వరరావు (చిన్న), బోడ ఉమ అనారోగ్యంతో మరణించడంతో అనాదలుగా మిగిలిన ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి, అదేవిధంగా కొడుకు చనిపోయి అనారోగ్యంతో ఒంటరి జీవితం గడుపుతున్న బొమ్మకంటి బూబమ్మ కుంటుంబానికి నెలకు సరిపడ నిత్యవసర సరుకులు, 25కేజీల బియ్యం, కొంత ధన రూపంలో ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు మరియు ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నిలిచారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ.. పేదవారికి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మం అన్నారు. మానవసేవయే మాధవసేవ అనే స్ఫూర్తి తో సేవలు అందిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గుర్రం వెంకట్రామయ్య, తుళ్లూరు ప్రసాద్, గుర్రం కృష్ణయ్య, తేజావత్ వీరన్న, గద్దల నాగేశ్వరరావు, తేజావత్ సంఘం, జక్కంపూడి సతీష్, తుళ్లూరు మధు, జగదీష్ యువసైన్యం మంచాల నాగ, తోట సతీష్, ఆంగోతు కిషోర్, కంచర్ల శేఖర్, పందుల కార్తిక్, ఉప్పెర్ల ఉదయ్, కొండా రాకేష్, బొమ్మకంటి జగదీష్, లింగనబోయిన నవదీప్, మంచాల రాజు, లింగనబోయిన హేమంత్, మల్లు భరత్, రాగం పండు, వనపర్తి ఉదయ్, తేజావత్ బాలకృష్ణ, కుమ్మరకుంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులకు మామూలు ఈ అక్రమ నిర్మాణాలు చెయ్యి

- తార్నాక మెట్టుగూడ సర్కిల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న జోనల్ సిపి శ్రీనివాస్
- అంతా అవినీతి అయితే ఇక వ్యవస్థలో చట్టాలు ఎందుకు.?
- నోటీసులు ఇచ్చిన కూల్చకపోవడం వెనుక లంచాలే కారణమా.?
- మున్సిపల్ శాఖలో ఏసిపిలు, సెక్షన్ ఆఫీసర్లు పూర్తిగా అవినీతిలో మునిగిపోయారా.?





నేటి దర్శిని
epaper.netidarshini.com
18 Mar 2026 - Page 5

## సికింద్రాబాద్ సర్కిల్లో అక్రమ నిర్మాణాల జోరు..!

- అక్రమ నిర్మాణాలపై ఎసిపి పావని మౌనం...!
- చైన్ మెన్ రాజు నిర్లక్ష్యం...!
- సీజ్ చేసినా కూల్చివేతలు లేవు
- నోటీసులు మాత్రమే.. చర్యలు ఎక్కడ?
- అధికారులపై అవినీతి ఆరోపణలు..!

సికింద్రాబాద్, మార్చి 17(నేటి దర్శిని): సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. తార్నాక సర్కిల్ పరిధిలోని సీతాఫల్మండి ఫ్లైఓవర్ సమీపంలో భారీగా అక్రమ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులకే పరిమితమైపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే, పిసలోకర్ కాలనీలో అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ, ఎటువంటి కూల్చివేత చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుందని తెలిసినా అధికారులు మౌనంగా ఉండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి పెరిగిందని, నోటీసులు ఇచ్చి తర్వాత లంచాలు తీసుకొని చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా చైన్ మెన్ రాజు, ఏసీపీ పావని బాధ్యతారాహిత్యంతోనే ఈ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ప్రాథమికంగా అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన చైన్ మెన్ ఇంత పెద్ద స్థాయిలో జరుగుతున్న నిర్మాణాన్ని ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నిస్తున్నారు. అధికారుల మౌన మద్దతు లేకుండా ఇలాంటి నిర్మాణాలు సాధ్యం కాదని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తార్నాక సర్కిల్ అక్రమ నిర్మాణాలకు కేంద్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



నేటి దర్శిని
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
epaper.netidarshini.com
01 Mar 2026 - Page 4

## సికింద్రాబాద్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల దందా..?

- సీతాఫల్మండి ఫ్లైఓవర్ పక్కన భారీ అక్రమ నిర్మాణం
- నోటీసులు ఇచ్చి కూల్చివేతలు ఎందుకు లేవు..?
- లంచాల ఆరోపణలతో టౌన్ ప్లానింగ్‌పై తీవ్ర విమర్శలు
- చైన్‌మెన్ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- డిప్యూటీ కమిషనర్ జోక్యం కోరుతున్న ప్రజలు

సికింద్రాబాద్,ఫిబ్రవరి28 (నేటి దర్శిని): సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. సీతాఫల్మండి ఫ్లైఓవర్ (బ్రిడ్జ్ ప్రధాన రహదారి పక్కన, పిసలోకర్ కాలనీలో (పక్కింటి నెం.12-10-48 సమీపంలో) భారీ అక్రమ నిర్మాణం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం వాహన రద్దీతో కిటకిటలాడే ప్రధాన రహదారి పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం సాగుతుండటంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నోటీసులే కానీ చర్యలే లేవా..?**

ఈ నిర్మాణం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, తదుపరి చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. కూల్చివేతలు జరగకపోవడం వెనుక లంచాల వ్యవహారం ఉన్నదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**టౌన్ ప్లానింగ్‌లో అవినీతి ఆరోపణలు**

అనుమతులు లేకుండా భారీ నిర్మాణం కొనసాగుతుండటం టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. కొందరు అధికారులు భారీగా లంచాలు తీసుకుని కళ్లు మూసుకున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన శాఖే మౌనంగా ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోందని ప్రజలు అంటున్నారు.

**చైన్‌మెన్ బాధ్యత ఎక్కడ..?**

ప్రాథమికంగా అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన చైన్‌మెన్ తన విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించారని స్థానికులు మండిపడుతున్నారు. ఇంత భారీ నిర్మాణం కొనసాగుతున్నా ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో చైన్‌మెన్ పాత్రపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఉన్నతాధికారుల జోక్యం అవసరం**

ఇప్పటికైనా సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందించి అక్రమ నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే సికింద్రాబాద్ సర్కిల్ మొత్తం అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారే ప్రమాదం ఉందని హెచ్చరిసునారు.



హైదరాబాద్, మార్చి31 (నేటి దర్శిని): సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల దందా రోజు రోజుకు విస్తరిస్తూ ప్రజల ఆగ్రహానికి గురవుతోంది. అనుమతులు లేకుండా అంతస్తులపై అంతస్తులు కట్టేస్తూ పట్టణ ప్రణాళిక నియమాలను బేఖాతరు చేస్తున్న నిర్మాణదారులకు కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనంగా మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నాయకుల పేర్లు చెప్పుకుంటూ అక్రమాలకు బలమైన కవచం ఏర్పరుచుకుంటున్న అక్రమ నిర్మాణదారులు టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యాన్ని పూర్తిగా వినియోగించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని తార్నాక, మెట్టుగూడ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో అనధికార అక్రమ నిర్మాణాలు వేగంగా పెరుగుతున్నా వాటిపై చర్యలు తీసుకోవాల్సిన ఎసిపి, సెక్షన్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు మౌనం వహిస్తూ చర్యలు మరిచి ఊరుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పత్రికల్లో పదేపదే కథనాలు వెలువడుతున్నప్పటికీ, ఒక్కటి రెండు నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేయకుండా ఫైళ్లు మూసివేయడం తప్ప కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన కొందరు అధికారులు, నిర్మాణదారులతో లంచాల సెటిల్మెంట్లకు దిగుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనివల్ల హైదరాబాద్ నగర నిర్మాణ శైలే పూర్తిగా దెబ్బతింటు భవిష్యత్తులో ప్రమాదాలకు కూడా తలుపులు తెరుస్తోంది. ఇరుకైన రహదారులు, పార్కింగ్ సమస్యలు, డ్రైనేజ్ ఇబ్బందులు అన్ని కలిసి ప్రజల జీవన ప్రమాణాలను పూర్తిగాదిగజారుస్తున్నాయి. జిహెచ్ఎంసి కమిషనర్లు తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ, వాటి ఫలితాలు ఎక్కడ కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమిషనర్ మీటింగ్‌లతో మాత్రమే పరిపాలన సాగుతుందా.? లేక వాస్తవ పరిస్థితులను మార్చే చర్యలు ఎప్పుడు తీసుకుంటారు.? అనే ప్రశ్నలు ప్రజల నుండి వస్తున్నాయి. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్లు, ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోని సస్పెండ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే సికింద్రాబాద్ జోన్ ప్రాంతం అక్రమాల గూటిగా మారిపోవడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరి కమిషనర్ ఏ పాటీ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## ఢిల్లీ నుంచి తిరుపతివరకు సైకిల్ యాత్ర... యష్‌పాల్‌కు ఘన స్వాగతం

**శ్రీ తిరుపతివరకు ధర్మయాత్ర... యష్‌పాల్ సంకల్పానికి దేశం సెల్యూట్!**

- షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు బైపాస్ రోడ్డులో యష్‌పాల్‌ను ఘన స్వాగతం పలికిన ఎండి అజీమ్



కొత్తూరు, మార్చి31 (నేటి దర్శిని ప్రతినిధి): ఢిల్లీ నుంచి తిరుపతివరకు సైకిల్‌పై దీక్షతో బయలుదేరిన బజరంగ్ దళ్ గౌరక్షక్ యష్‌పాల్ తన అచంచల సంకల్పం, అద్భుతమైన ధైర్యసాహసాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. కిలోమీటర్ల దూరాన్ని లెక్కచేయకుండా, ఎండవానలకు లొంగకుండా ఆయన కొనసాగిస్తున్న ఈ యాత్ర నిజంగా స్ఫూర్తిదాయకం.

షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు బైపాస్ రోడ్డులో యష్‌పాల్‌ను ఎండి అజీమ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యష్‌పాల్ చేస్తున్న ఈ యాత్ర దేశానికి ఆదర్శమని, యువతలో దేశభక్తి, సేవా స్ఫూర్తిని రగిలించే గొప్ప ప్రయత్నమని కొనియాడారు. ఒక్క సైకిల్‌తో వేల కిలోమీటర్ల ప్రయాణం చేయడం అంటే అసాధారణ ధైర్యం, కఠినమైన నియమాలు, అంకితభావం అవసరం. అలాంటి లక్షణాలన్నింటినీ ప్రతిబింబిస్తున్న యష్‌పాల్ యాత్ర సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. యష్‌పాల్ సంకల్పం సఫలమవాలని, ఆయన యాత్ర విజయవంతంగా పూర్తవాలని స్థానికులు హృదయపూర్వకంగా ఆకాంక్షించారు.

## బాధిత కుటుంబానికి సీఐ వెంకటేశ్వరుల ఆర్థిక సాయం

- అంత్యక్రియల ఖర్చులకు రూ.15 వేల సహాయం




ఆమనగల్లు, మార్చి 31 ఆమనగల్లు మండలం సీతారాం నగర్ తండా పరిధిలోని పులుగొనిపల్లి తండాకు చెందిన బాణావత్ రాందాస్ నాయక్ చేతిలో భార్య, కుమారుడు మృతి చెందిన ఘటనపై సీఐ వెంకటేశ్వరులు స్పందించారు. మృతురాలి అక్క కళకు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి చట్టపరంగా పూర్తి న్యాయం చేస్తామని సీఐ వెంకటేశ్వరులు హామీ ఇచ్చారు.

## ఎస్పీఆర్ విద్యాసంస్థలపై దుష్ప్రచారం నమ్మవద్దు: యాజమాన్యం స్పష్టీకరణ

- అసత్య ప్రచారాలను నమ్మొద్దు..
- నల్గొండ బ్రాంచ్ ఎస్పీఆర్ విద్యాసంస్థ నూతన మూడవ బ్రాంచ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కొండమల్లేపల్లిలో ఏర్పాటు
- గుర్తింపు పత్రాలను మీడియా ముందుంచిన పాఠశాల నిర్వాహకులు
- ప్రభుత్వ గుర్తింపు సంఖ్య: G-KDMLP 014-0005
- నాణ్యమైన విద్యే మా లక్ష్యం
- విలేకరుల సమావేశంలో వెల్లడి







కొండమల్లేపల్లి, మార్చి 31 (నేటి దర్శిని ): నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఎస్పీఆర్ (SPR) విద్యాసంస్థలపై సోషల్ మీడియాలో మరియు కొన్ని వర్గాల ద్వారా జరుగుతున్న దుష్ప్రచారాన్ని పాఠశాల యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. మంగళవారం కొండమల్లేపల్లిలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్/డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు వరప్రసాద్ మాట్లాడుతూ, కొండమల్లేపల్లిలో నూతనంగా ప్రారంభించిన నల్లగొండ వారి ఎస్పీఆర్ పాఠశాల మూడవ బ్రాంచ్‌కు అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని స్పష్టం చేశారు. 2026-27 విద్యా సంవత్సరం నుండి కార్యకలాపాలు ప్రారంభించేందుకు గాను 2025 జూలై 7వ తేదీనే తెలంగాణ ప్రభుత్వం నుండి గుర్తింపు (Recognition సంఖ్య: -KDMLP 014-0005) లభించిందని, అన్ని చట్టపరమైన నిబంధనలు పాటించిన తర్వాతే పాఠశాల ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. గత 22 సంవత్సరాలుగా విద్యా రంగంలో ఉన్న సుదీర్ఘ అనుభవంతో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా అత్యున్నత ప్రమాణాలతో బోధన అందిస్తున్నామని ఆయన తెలిపారు. కొండమల్లేపల్లి మండల విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ బ్రాంచ్‌ను అందుబాటులోకి తెచ్చామని, ఇక్కడ సాధారణ విద్యతో పాటు ఐఐటి (IIT) ఫౌండేషన్, నీట్ (NEET) మరియు ఒలింపియాడ్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీని తట్టుకోలేక కొందరు కావాలనే చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను నమ్మి తల్లిదండ్రులు గందరగోళానికి గురికావద్దని, ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విద్యాసంస్థల ప్రతినిధులు శేషరాజుపల్లి వెంకన్న, విప్లవ రెడ్డి, రమేష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూ భారత్ నగర్ కాలనీలో వాటర్ ట్యాంక్ ను ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యేకు,మున్సిపల్ చైర్ పర్సన్ కు వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు

కొత్తూరు 31మార్చ్ నేటి దర్శిని ప్రతినిధి కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ న్యూ భారత్ నగర్ కాలనీ ప్రజలు ఏడాది పాటు నీళ్ళు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే టెన్ పర్సెంట్ ల్యాండ్ లో వాటర్ ట్యాంకు నిర్మించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు, మున్సిపల్ చైర్ పర్సన్ బాతుగా లావణ్య దేవేందర్ యాదవ్ కు వినతి పత్రం న్యూ భరత్ నగర్ కాలనీవాసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దాదాపు రెండేళ్ల పాటు తాగునీరు సరఫరా చేసే పైపులు రోడ్డు పనుల్లో ధ్వంసం అయ్యాయని వారు తెలిపారు. న్యూ భరత్ నగర్ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలని వారు కోరారు.



ఫిర్యాదు చేసిన వారిలో లక్ష్మణ్,రూప్సింగ్,రాజు,యాదగిరి, శ్రీను,సురేష్,ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



# మాస్ లుక్ లో ఫరియా అబ్దుల్లా

టాలీవుడ్ చిట్టి అలియాస్ ఫరియా అద్బుల్లా.. హిట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తుంది. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్న ఈ సుందరి. ఆతర్వాత పెద్దగా సక్సెస్ సాదించలేకపోతుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న పెద్దగా లాభం లేకుండా పోతుంది. జాతిరత్నాలు సినిమాతో పరిచయమైన ఫరియా.. ఆ సినిమాలో తన క్యూట్ పర్ఫామెన్స్ తో కట్టిపడేసింది. అలాగే తర్వాత వచ్చిన సినిమాల్లో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది. తన అందాలతో మతిపోగొట్టింది ఫరియా అద్బుల్లా.. కానీ సినిమాలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. సింహ హీరోగా నటించిన మత్తువదలరా 2 సినిమా ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. కానీ ఆతర్వాత మళ్లీ ఫ్లాప్స్ పలకరించాయి. చివరిగా ఈ అమ్మడు గుర్రం పాపిరెడ్డి అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు రూటు మార్చి మాస్ పాత్రతో ఆకట్టుకోనుంది. ప్రస్తుతం ఫరియా అద్బుల్లా భగవంతుడు అనే సినిమాలో నటిస్తుంది. ఇటీవలే ఈ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. ఈ టీజర్ లో ఫరియా అద్బుల్లా మాస్ పాత్రలో కనిపించింది. అలాగే బోల్డ్ గానూ నటించింది. ఈ సినిమాతో ఫరియా అద్బుల్లా హిట్ కొట్టేలా కనిపిస్తుంది.కాగా సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడు ఓ రేంజ్ లో అందాలతో రచ్చ చేస్తుంది. కుర్రాళ్లు చూపుతిప్పుకోనివ్వకండా ఫోటోలు షేర్ చేస్తుంది. ఈ సుందరి షేర్ చేసే ఫోటోలకు కుర్రకారు ఫిదా అవుతున్నారు. నెటిజన్స్ రెచ్చిపోయి కామెంట్స్ చేస్తున్నారు.




# పర్వీన్ బాబీ బయోపిక్‌లో?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ పర్వీన్ బాబీ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో సినిమా రానున్నది. జోయా మెహ్రా తెరకెక్కించనున్న ఈ చిత్రంలో పర్వీన్ బాబీగా త్రిప్తి డిమ్రీ కనిపించనున్నది. పర్వీన్‌బాబీ జీవితంలోని గ్లామర్, వివాదాలు, వ్యక్తిగత పోరాటాలు.. వీటన్నింటినీ సమతుల్యంచేసి, అద్భుతమైన బయోపిక్‌గా ఈ చిత్రాన్ని తెరమీదకు తీసుకురావాలనే ప్రయత్నంలో మేకర్స్ ఉన్నారు.అయితే.. పర్వీన్‌గా త్రిప్తీని ఎంపిక చేయడంపై బాలీవుడ్‌లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గొప్పనటిగా కీర్తింపబడ్డ పర్వీన్‌బాబీ పాత్రకు త్రిప్తి న్యాయం చేయగలదా? అంటూ కొందరు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ డిబేట్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేటయింది. తృప్తి డిమ్రీపై మేకర్స్ మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నారు. త్వరలోనే సినిమా సెట్స్‌కి వెళ్లనుంది.

# ‘కథనార్’ ట్రైలర్ రిలీజ్..

## అనుష్క మరోసారి పీరియాడిక్ అవతారంలో మెప్పించనుందా?




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ‘బాహుబలి’ తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల ‘ఘాటీ’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ ‘కథనార్’తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.తాజాగా విడుదలైన ‘కథనార్’ ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ఇక అనుష్క ఫ్యాన్స్ మాత్రం ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ‘బాహుబలి’ తరహాలోనే మరోసారి బలమైన పాత్రలో ఆమె కనిపించనుందని ట్రైలర్ సంకేతాలు ఇస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఇటీవల వరుసగా వచ్చిన సినిమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోయినా, ‘కథనార్’తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ చిత్రం విడుదలైన తర్వాత ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపిరి పోస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# కుర్రాళ్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దివ్య భారతి




ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిన హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. తమ అందంతో కుర్రకారుకు కిర్రెక్కించి.. డ్రీమ్ గర్ల్ అనే ట్యాగ్ ను సొంతం చేసుకున్న వారిలో దివ్య భారతి ఒకరు. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమిళ్ సినిమా బ్యాచిలర్ మూవీతో సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ దివ్య భారతి.. ఈ సినిమాలో బోల్డ్ పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది ఈ సుందరి. దాంతో ఈ బ్యూటీకి కుర్రాళ్ళు ఫిదా అయ్యారు. ఆతర్వాత ఈ అమ్మడు వరుస సినిమాలతో బిజీ అవుతుందని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. చాలా గ్యాప్ తర్వాత జీవి ప్రకాష్ తో కలిసి కింగ్ స్టన్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక ఇప్పుడు తెలుగులో సినిమాలు చేస్తుంది ఈ అందాల తార. సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది. కానీ ఈ సినిమా విడుదలకు మాత్రం నోచుకోవడం లేదు.. ఎప్పటినుంచో ఈ సినిమా షూటింగ్ జరుగుతూ ఉంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో దివ్యభారతి ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గ్లామరస్ ఫొటోలతో నెటిజన్స్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది దివ్య భారతి. తాజాగా ఈ అమ్మడు వదిలిన ఫోటోలు కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి.



# ప్రభాస్ స్పీడ్‌కు ఇండస్ట్రీ షాక్!

## ఒకేసారి మూడు పాన్ ఇండియా చిత్రాలతో బిజీ..



ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఒకేసారి రెండు సినిమాలు చేయడమే కష్టమైన ఈ రోజుల్లో, ప్రభాస్ ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ ‘స్పిరిట్’, ‘ఫౌజీ’, ‘కల్కి 2’ వంటి మూడు భారీ బడ్జెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా ‘ఫౌజీ’, ‘స్పిరిట్’ షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు ‘కల్కి 2’ షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా ‘సలార్’, ‘కల్కి 2898’, ‘ఆదిపురుష్’ వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మూడు సినిమాలను సమాంతరంగా నిర్వహిస్తూ, ప్రతి ప్రాజెక్ట్‌కు న్యాయం చేయడం ద్వారా ఆయన ప్రత్యేకతను మరోసారి నిరూపిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న ఈ మల్టీ-ప్రాజెక్ట్ వర్క్ స్టైల్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకేసారి మూడు భారీ సినిమాలు చేయడం చిన్న విషయం కాదని, ఇది ఆయన అంకితభావానికి నిదర్శనమని సినీ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

**Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365**